PRGI NO: APTEL/26/A1204
# కింగ్
డైలీ న్యూస్ పేపర్
King Daily News Paper

విజయవాడ,హైదరాబాద్ సంపుటి 01 సంచిక 78 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు బుధవారం 24 జూన్ 2026 వెల -3 పేజీలు -8

## పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం.. స్పందించిన మంత్రి లోకేశ్

దక్షిణ్ ఎనర్జీ ప్లాంట్‌లో ఇద్దరు కార్మికులు సజీవ దహనం
ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్ సమయంలో పేలిన ట్యాంకు
మృతుల కుటుంబాలకు మంత్రి నారా లోకేశ్ సంతాపం
ఘటనపై విచారణకు ఆదేశించిన పోలీసులు

అనకాపల్లి జిల్లా పరవాడ

# ఉద్యోగులపై వరాల జల్లు.. భారీ పెట్టుబడులకు ఆమోదం... ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.39,355 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
రాష్ట్రంలో 34,610 మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్
అమరావతి పనుల వేగవంతం.. మౌలిక వసతులకు టెండర్లకు ఆమోదం
కొందరు ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం..
పీఎస్‌యూల్లో రిటైర్మెంట్ వయసు 62కి పెంపు
మచిలీపట్నం, రామయ్యపట్నం పోర్టుల పరిధుల క్రమబద్ధీకరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు

అమరావతి





## తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్.. పేరు సూచిస్తే లక్ష రివార్డ్

హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి భారీ పథకం
పథకానికి మంచి పేరు సూచిస్తే లక్ష రూపాయల నగదు బహుమతి
తెలంగాణ హౌసింగ్ బోర్డ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సూచనలు పంపాలి
జూన్ 28వ తేదీ తుది గడువు

## పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

రాష్ట్రపతి భవన్ వేదికగా అట్టహాసంగా పద్మ పురస్కారాల ప్రదానం
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్
కార్యక్రమానికి హాజరైన మోదీ, అమిత్ షా



## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

ఉండవల్లి నివాసంలో బూత్ లెవల్ అధికారికి తన వివరాల సమర్పణ
ప్రతి పౌరుడూ ఓటు వివరాలు సరిచూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి
ఏపీలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

ఉండవల్లి

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తన ఓటు వివరాలను బూత్ స్థాయి అధికారికి (బీఎల్ఓ) అందజేశారు. మంగళవారం ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన బీఎల్ఓకు ఆయన అవసరమైన పత్రాలను, సమాచారాన్ని సమర్పించారు.

భారత ఎన్నికల సంఘం



## వడ్డెరలకు ఇచ్చిన హామీని నెరవేర్చాం: నారా లోకేశ్

క్వారీల్లో వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తామని యువగళం సమయంలో లోకేశ్ హామీ
వడ్డెరలకు 33 శాతం కేటాయిస్తూ జీవో జారీ చేసిన ప్రభుత్వం
తమది చేతల ప్రభుత్వం అన్న లోకేశ్

అమరావతి

వడ్డెర సామాజికవర్గానికి క్వారీల్లో 33 శాతం వాటా కేటాయించాలని యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వడ్డెరలకు 33 శాతం వాటా కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 126 జారీ చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "యువగళం పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాను. ఆ సమయంలో వడ్డెర సోదరులు తమ కులవృత్తిని కొనసాగించడానికి క్వారీలు కేటాయించాలని నన్ను కోరారు. ఆనాడు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవో జారీ చేశాం" అని తెలిపారు. తమ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని చెప్పారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నామని అన్నారు. మరోవైపు, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వడ్డెర సంఘాల నేతలు, కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ కులవృత్తికి ప్రభుత్వం గుర్తింపు ఇచ్చినందుకు వారు మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.




## పవన్ కు మద్దతుగా క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుంటే గట్టిగా బదులివ్వాలని మంత్రులకు సీఎం ఆదేశం
నేరస్థులతో వైసీపీ రాజకీయాలు చేస్తోందని చంద్రబాబు విమర్శ
జూలై 3న కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు వెల్లడి
శాఖలకే పరిమితం కావొద్దు, అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచన
80కి పైగా అంశాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

అమరావతి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఏవైనా వివాదాలు సృష్టిస్తే వాటిని సమష్టిగా, బలంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్ సహచరులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం జరిగిన కేబినెట్



# ఉద్యోగులపై వరాల జల్లు.. భారీ పెట్టుబడులకు ఆమోదం... ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడం, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, పర్యాటక రంగం అభివృద్ధి వంటి అంశాలపై క్యాబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశానంతరం తీసుకున్న నిర్ణయాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

భారీగా పారిశ్రామిక పెట్టుబడులు

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) సిఫారసు చేసిన పలు ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. మొత్తం రూ.39,355 కోట్ల పెట్టుబడులతో, 34,610 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పించే పరిశ్రమలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఇందులో భాగంగా ఏర్పాటు చేయనున్న కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు:

ప్రీమియర్ ఎనర్జీస్ (తిరుపతి): రూ.3,936 కోట్ల పెట్టుబడితో సిలికాన్ వేఫర్, మాడ్యూల్ తయారీ యూనిట్. 540 మందికి ఉపాధి.

కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ (అనకాపల్లి): రూ.2,788 కోట్ల పెట్టుబడితో 1000 మెగావాట్ల డేటా సెంటర్.

ప్రొటేరియల్ ఇండియా (అనకాపల్లి): రూ.2,250 కోట్ల పెట్టుబడితో నియోడిమియం ఐరన్ బోరాన్ మాగ్నెట్ తయారీ పరిశ్రమ. 530 మందికి ఉపాధి.

రాఖీమాచీజు ఇండియా (కాకినాడ): రూ.1,900 కోట్ల పెట్టుబడితో వాడిన వంట నూనెల నుంచి విమాన ఇంధనం తయారు చేసే యూనిట్. 2,500 మందికి ఉపాధి.

ఎన్ఎస్ మాగ్నటెక్ (తిరుపతి): రూ.1,250 కోట్ల పెట్టుబడితో రేర్ ఎర్త్ పర్మనెంట్ మాగ్నెట్ తయారీ. 400 మందికి ఉపాధి.

ఏపీ జేఎస్‌డబ్ల్యూ స్టీల్ (ప్రకాశం): రూ.1,230 కోట్లతో స్టీల్ బెనిఫికేషన్ ప్లాంట్.

వీటితో పాటు రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికంగా ఎండ్-టు-ఎండ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అమరావతికి జవసత్వాలు

ఐదేళ్లుగా నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది.

అమరావతిలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ కోసం గతంలో టాబ్రీడ్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 35,000 టన్నుల సామర్థ్యంతో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయం.

ల్యాండ్ పూలింగ్ రైతులకు కేటాయించిన ప్లాట్లలో రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులకు సంబంధించిన టెండర్లకు ఆమోదం.

రైతుల ప్లాట్ల సరిహద్దుల వివాదాలను పరిష్కరించేందుకు అవసరమైన రెక్టిఫికేషన్ డీడ్‌లపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల నుంచి మినహాయింపు.

పనుల పర్యవేక్షణ కోసం ఏపీసీఆర్‌డీఏలో 95 తాత్కాలిక పోస్టుల (డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు) మంజూరు.

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణానికి రూ.130.38 కోట్లకు టెండర్ ఆమోదం.

ఉద్యోగులకు శుభవార్త

ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లపై క్యాబినెట్ సానుకూలంగా స్పందించింది. 2004కు ముందు నోటిఫికేషన్ పొంది, ఆ తర్వాత నియామకం అయిన 2003 డీఎస్సీ టీచర్లు, 10/99 గ్రూప్-1 ఉద్యోగులు సహా మొత్తం 10,715 మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) వర్తింపజేయాలని నిర్ణయించింది.

షెడ్యూల్ 9, 10 పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 62 ఏళ్లు పూర్తికాని రిటైర్డ్ ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

పోర్టులు, పర్యాటకం, ఇతర నిర్ణయాలు

పోర్టుల అభివృద్ధి: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు అనుగుణంగా మచిలీపట్నం పోర్టు పరిధిని 64 కి.మీ. నుంచి 15 కి.మీ.కు, రామయ్యపట్నం పోర్టు పరిధిని 51 కి.మీ. నుంచి 15 కి.మీ.కు కుదిస్తూ నోటిఫికేషన్ల జారీకి ఆమోదం. రామయ్యపట్నం పోర్టును డీబీఎఫ్ఓటీ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ఆపరేటర్ నియామకానికి ఆర్ఎఫ్‌పీ జారీకి అనుమతి.

పర్యాటకం: గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'హోమ్ స్టే', 'బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' ఏర్పాటును సులభతరం చేస్తూ పర్యాటక పాలసీకి సవరణలు. తిరుపతి మినహా రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో బార్లు, రిటైల్ మద్యం దుకాణాల ఏర్పాటుకు నూతన విధానానికి ఆమోదం.

రవాణా శాఖ: ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న టూరిస్ట్ బస్సులను రాష్ట్రంలోకి ఆకర్షించేందుకు, ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిట్ వాహనాల త్రైమాసిక పన్నును ప్రతి సీటుకు రూ.4,000 నుంచి రూ.2,500కు తగ్గింపు.

ఆరోగ్యశ్రీ: నెట్‌వర్క్ ఆసుపత్రులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నివారించేందుకు "బిల్ డిస్కౌంటింగ్ సిస్టమ్"కు ఆమోదం. దీనివల్ల ఆసుపత్రులు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల నుంచి తక్షణమే నిధులు పొందవచ్చు.

పరిపాలన: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం సహా 28 జిల్లాల కలెక్టరేట్లలో పాలనను బలోపేతం చేసేందుకు అదనపు పోస్టుల క్రమబద్ధీకరణకు ఆమోదం.

పునరుత్పాదక ఇంధనం: కడప జిల్లాలో 1000 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఏపీఎస్పీసీఎల్‌కు భూమి కేటాయింపు. యాగంటి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 1000 మెగావాట్ల నుంచి 1500 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదం.

ఈ మేరకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్న అంశాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# పరవాడ ఫార్మాసిటీలో అగ్నిప్రమాదం.. స్పందించిన మంత్రి లోకేశ్

అనకాపల్లి జిల్లా పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో మంగళవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. దక్షిణ్ ఎనర్జీ పరిశ్రమలో చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు సజీవ దహనమవగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

ఈ ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్మికుల మరణం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుంది" అని లోకేశ్ హామీ ఇచ్చారు.

ఈ ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు కూడా విచారం వ్యక్తం చేశారు. పారిశ్రామిక ప్రాంతాల్లో కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించాల్సిన అవసరాన్ని మాధవ్ నొక్కిచెప్పారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారని, ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోందని రమేశ్ బాబు తెలిపారు.

కాగా, ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఇప్పటికే స్పందించి, మృతుల కుటుంబాలకు తమ సంతాపం ప్రకటించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# పవన్ కు మద్దతుగా క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

సమావేశం అనంతరం మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.

వైసీపీ నేరస్థులతో కలిసి రాజకీయాలు చేస్తోందని, కర్నూలు ఘటనను ఉదాహరణగా చూపుతూ కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్‌ను వివాదాల్లోకి లాగేందుకు ప్రయత్నిస్తే మంత్రులంతా ఐక్యంగా, గట్టిగా బదులివ్వాలని సూచించారు. ప్రభుత్వంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

మంత్రులు కేవలం తమ శాఖలకే పరిమితం కాకుండా, డీఎస్సీ వంటి ఇతర కీలక అంశాలపై కూడా పూర్తి అవగాహన పెంచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఇదే సమయంలో, కర్నూలు జిల్లాలోని జొన్నగిరి గ్రామంలో స్వర్ణ ప్రాజెక్టులు ఉన్నందున ఆ గ్రామాన్ని 'స్వర్ణ గ్రామం'గా ప్రకటించాలని ప్రతిపాదించారు. జూలై 3న కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు కూడా ఆయన వెల్లడించారు.

అంతకుముందు జరిగిన కేబినెట్ సమావేశంలో పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగాలకు సంబంధించి 80కి పైగా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ మృతి కేసులో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, దీనిని వైసీపీ రాజకీయం చేస్తోందని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విచారణపై మృతుడి కుటుంబ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారని కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది

# పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న రాజేంద్రప్రసాద్, మురళీమోహన్

మన తెలుగు చలనచిత్ర పరిశ్రమకు జాతీయ స్థాయిలో మరోసారి గర్వించదగ్గ గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ వేదికగా పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవ కార్యక్రమం ఈరోజు అత్యంత వైభవంగా జరిగింది. వివిధ రంగాల్లో దేశానికి విశేష సేవలు అందించిన ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అత్యున్నత పౌర పురస్కారాలను అందజేశారు. ఈ విడతలో మొత్తం 47 మందికి పద్మశ్రీ అవార్డులు ప్రదానం చేయగా.. అందులో మన టాలీవుడ్ లెజెండ్స్ ఉండటం విశేషం.

నాలుగు దశాబ్దాలుగా వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో, హాస్యంతో కోట్లాది మంది తెలుగు ప్రేక్షకులను అలరించిన 'నటకిరీటి' రాజేంద్రప్రసాద్.. కళారంగానికి చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు.

నటుడిగా, నిర్మాతగా 'జయభేరి' బ్యానర్‌పై అద్భుతమైన చిత్రాలు నిర్మించడమే కాకుండా, 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు మురళీమోహన్ కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్

దేశవ్యాప్తంగా చేపట్టిన "ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా లోకేశ్ పిలుపునిచ్చారు. పారదర్శకమైన, కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రజలందరూ సహకరించాలని, తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యుడిగా లోకేశ్ స్వయంగా ఈ ప్రక్రియలో పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారులు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లను తొలగించడంతో పాటు, అర్హులైన నూతన ఓటర్ల నమోదును చేపడుతున్నారు. అభ్యంతరాలు పరిశీలన అనంతరం జులై 21న ముసాయిదా జాబితాను, సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నారు.

# తెలంగాణ హౌసింగ్ బోర్డ్ బంపర్ ఆఫర్.. పేరు సూచిస్తే లక్ష రివార్డ్

తెలంగాణ

హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను కోరుతోంది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును సూచించిన విజేతకు తెలంగాణ గృహనిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది.

ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ భారీ ప్రాజెక్టుకు సముచితమైన పేరును నిర్ణయించే ప్రక్రియలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని భావిస్తున్నట్లు హౌసింగ్ బోర్డ్ వైస్-ఛైర్మన్ గౌతమ్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు తమ సూచనలను స్త్రష్ట్రు.శీటటఱఎఱఖశ్రీ అనే అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా సమర్పించవచ్చు. పేర్లను పంపేందుకు 2026 జూన్ 28వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు.

# రాష్ట్రపతి చేతుల మీదుగా 'పద్మశ్రీ' అందుకున్న రోహిత్ శర్మ

**రాష్ట్రపతి భవన్‌లో అవార్డు ప్రదానం**

**క్రికెట్‌కు చేసిన విశేష సేవలకు గానూ ఈ గౌరవం**

**భార్య రితికా సజ్దేతో కలిసి హాజరైన రోహిత్ శర్మ**



ఢిల్లీ

భారత క్రికెట్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నాడు. మంగళవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగిన పౌర పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'హిట్ మ్యాన్' ఈ గౌరవాన్ని స్వీకరించాడు. గత మే నెలలో జరిగిన తొలి విడత కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన రోహిత్, రెండో విడతలో తన భార్య రితికా సజ్దేతో కలిసి విచ్చేసి ఈ పురస్కారాన్ని అందుకున్నాడు.

దాదాపు రెండు దశాబ్దాలుగా క్రికెట్ రంగానికి అందించిన విశేష సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం రోహిత్‌ను పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక చేసింది. 2007లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన రోహిత్, మూడు ఫార్మాట్లలోనూ అద్వితీయమైన రికార్డులను నెలకొల్పాడు. టెస్టుల్లో 4,300 పైగా పరుగులు (12 సెంచరీలు), వన్డేల్లో 11,500 కంటే ఎక్కువ పరుగులు (33 సెంచరీలు), టీ20ల్లో 4,200 పైగా పరుగులు సాధించి తనదైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే భారత్ 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలను కైవసం చేసుకుంది.

ఈ మహోన్నత ఘట్టం నేపథ్యంలో బీసీసీఐ, టీమిండియా రోహిత్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపాయి. "క్రీడా ప్రపంచంలోని ఓ గొప్ప యోధుడికి దక్కిన అత్యున్నత గౌరవం" అని అభివర్ణించాయి. ఈ ఏడాది ఆరంభంలో పద్మ పురస్కారాల ప్రకటన వెలువడినప్పుడు రోహిత్ స్పందిస్తూ, ఇది తనకే కాకుండా తన కుటుంబానికీ గర్వకారణమని, దేశం కోసం ప్రాతినిధ్యం వహించడానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పేర్కొన్నాడు. ప్రస్తుతం వన్డే ఫార్మాట్‌పై దృష్టి సారించిన రోహిత్, 2027 ప్రపంచకప్‌లోనూ ఆడటమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

# హీరోయిన్లను గౌరవంగా చూపించడంలో లోటు ఉంది: తమన్నా



సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా ఉంటుందన్న తమన్నా
హీరోయిన్లను గ్లామర్ బొమ్మలుగా చూపించడం తనకు నచ్చదని వ్యాఖ్య
గ్లామర్, నటన ఉన్నవాళ్లే సూపర్ స్టార్లు అవుతారన్న మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా గడుపుతోంది. ఇటీవల 'ఓ రోమియో', 'ఓదెల-2' వంటి చిత్రాలతో అలరించిన తమన్నా... స్పెషల్ సాంగ్స్‌లోనూ మాస్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' అనే క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో నటిస్తోంది.

దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వంలో, బాలాజీ టెలిఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, శ్వేతా తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను ఆగస్టు 26న గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తమన్నా సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీపై చేసిన కొన్ని బోల్డ్ కామెంట్స్ ఇప్పుడు నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి. కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్లను కేవలం గ్లామర్ బొమ్మలుగా చూసే విధానం తనకు అస్సలు నచ్చలేదని తమన్నా చాలా ఓపెన్‌గా చెప్పింది. సౌత్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుంటుందని, హీరోయిన్లను స్క్రీన్‌పై గౌరవప్రదంగా చూపించే విషయంలో అక్కడ కొంత లోటు కనిపిస్తోందంటూ తన మనసులోని అసంతృప్తిని బయటపెట్టింది.

భారతీయ సినిమాల్లో కమర్షియల్ ఎలిమెంట్స్ అయిన పాటలు, డ్యాన్సులకు చాలా ప్రాధాన్యత ఉంటుందని... ఈ విషయాన్ని తాను కెరీర్ ప్రారంభంలోనే గ్రహించానని తమన్నా తెలిపింది. బాలీవుడ్‌లో కేవలం యాక్టింగ్ మాత్రమే చేసే హీరోయిన్లు కొందరైతే, గ్లామర్ పాత్రలకే పరిమితమయ్యే వాళ్లు మరికొందరు ఉంటారని విశ్లేషించింది. కానీ, కేవలం ఒకే యాంగిల్‌కు పరిమితం కాకుండా... అటు గ్లామర్ చూపిస్తూనే, ఇటు నటనకు స్కోప్ ఉన్న పాత్రలు చేయగలిగిన వారే ఇండస్ట్రీలో సూపర్ స్టార్లుగా ఎదుగుతారని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. సౌత్ ఇండస్ట్రీలో కూడా తానే కాకుండా అనుష్క, నయనతార, సమంత వంటి వారు 10 నుంచి 15 ఏళ్ల పాటు స్టార్ హీరోయిన్లుగా నిలదొక్కుకున్నామంటే.. దానికి కారణం ఈ గ్లామర్, పెర్ఫార్మెన్స్ అనే రెండు విషయాలను పక్కాగా బ్యాలెన్స్ చేయడమేనని తమన్నా చెప్పుకొచ్చింది.

# జిల్లాలో చెరువులు పరిరక్షణ పక్కాగా జరగాలి.

## రాష్ట్ర వ్యవసాయ మంత్రి ఆదేశాలను పక్కగా అమలు చేయాలి.
## సుప్రీం కోర్ట్ ఉత్తర్వులను అధికారులు అమలు చేయాలి.
## నీటి వనరులను రక్షించాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.

పార్వతీపురం,(కింగ్ )

జిల్లాలో చెరువుల పరిరక్షణ పక్కాగా జరగాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ జిల్లా వైస్ చైర్మన్ బంకురు ప్రకాష్, ఏవో గంట మోహన్ రావు తదితరులు మాట్లాడుతూ గత మంగళవారం జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చంనాయుడు చెరువులు, కుంటలు ఆక్రమణలపై ఉక్కు పాదం మోపాలని, ఎంతటి వారినైనా వదలొద్దని, కఠినంగా వ్యవహరించాలని, ఏ పార్టీ వారైనా సరే ఎంతటి రాజకీయ రికమండేషన్ లో ఉన్నా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చెరువుల రక్షణకు అధికారులు కట్టుబడి ఉండాలని దిశా నిర్దేశం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో చెరువులన్నీ పక్కాగా రక్షింపబడాలన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలో కోట్లాది రూపాయలు విలువ చేసే చెరువుల్లో పక్కాభవనాలు నిర్మాణాలు జరిగాయని, వాటి తొలగింపులు అధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. ఇటీవల దేవుడి బంధ వ్యవహారంలో జరిగిన ప్రజలను మభ్యపెట్టే పనులు చెరువులు విషయంలో మళ్ళీ జరగరాదన్నారు. బిళ్ళ బంధ, దేవుడి బంధ, కామయ్య బంధం, పాత్రుని గారి కోనేరు, నెల్లిచెరువు, లక్ష్మనాయుడు చెరువు, లంకెల చెరువు, కోదు వాని బంధం, కొత్తవలస చెరువు ఇలా పార్వతీపురం జిల్లా కేంద్రంలోని చెరువులన్నీ దాదాపు ఆక్రమణలకు గురయ్యాయి అన్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న పెద్దలే పెద్దపెద్ద భవనాలు నిర్మించారన్నారు. అధికారులు రాజకీయ పలుకుబడికి లొంగకుండా రాష్ట్ర మంత్రి ఆదేశాలను, సుప్రీంకోర్టు ఉత్తర్వులను గౌరవించాలన్నారు. పార్వతీపురంలో ఇటీవల జరిగిన పరిణామాలు చూస్తే అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గినట్లు కనిపిస్తోందన్నారు. ఇటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా ముందు జిల్లా కేంద్రంలోని చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. భావితరాలకు బతుకు నిచ్చే నీటి వనరుల విధ్వంసాన్ని అరికట్టాలన్నారు. గత కొంతకాలంగా చెరువులు, గెడ్డలు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము అధికారుల దృష్టికి తీసుకు వెళు తున్నామన్నారు. అయినా చర్యలు శూన్యం అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి జిల్లా కేంద్రం పార్వతీపురం తో పాటు, అన్ని చెరువులను కబ్జాదారుల కబంధాల నుండి రక్షించాలని కోరారు. నీటి వనరుల ఆక్రమణల వలన ఇప్పటికే పెద్ద పెద్ద నగరాలతో పాటు చిన్న చిన్న పట్టణాలు కూడా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. చెరువులు కనుమరుగు కావడం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. వర్షాలు సకాలంలో కురవడం లేదన్నారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. కాబట్టి జిల్లా అధికారులు చెరువుల పరిరక్షణ పక్కాగా చేపట్టాలని కోరారు.



# మహోన్నత జాతీయవాది డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ

చింతూరు ,(కింగ్ )

భారతీయ జన సంఘ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన, మహోన్నత జాతీయవాది డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి వర్ధంతి సందర్భంగా ఈ రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పోలవరం జిల్లా, చింతూరు డివిజన్, చింతూరు మండలం, చింతూరు యస్ టి కాలనీ 12 వ వార్డు,బూత్ నెం 346 లో మాజీ బిజెపి మండల అధ్యక్షులు డి వి యస్ రమణ రెడ్డి(చిట్టిబాబు )ఆధ్వర్యంలో ముఖ్య అతిథి గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు పాయం. వెంకయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు

దేశ సమైక్యత, జాతీయత, దేశాభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారి సేవలు చిరస్మరణీయమైనవి. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త కట్టుబడి ఉండాలని చెప్పారు.




ఈ కార్యక్రమంలో మాజీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు తుర్రం అశోక్ కుమార్ దొర, జారీ. బొజ్జమ్మ, కాశి బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ నిర్వాసితులకు నగదు పరిహారం చెల్లించాలి: నిర్వాసితుల సంఘం

అచ్యుతాపురం,,(కింగ్ )




అనకాపల్లి జిల్లా ప్రజాదర్బార్ కార్యక్రమంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్‌కు అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితుల తరఫున మెమోరాండం అందజేశారు. టిడిఆర్ బాండ్లు కాకుండా నగదు రూపంలోనే నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనకాపల్లి మరియు అచ్యుతాపురం రోడ్డు నిర్వాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాంద్రేగుల రామ సదాశివరావు మాట్లాడుతూ, 2023లో జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు నిర్వహించిన గ్రామసభల్లో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్వాసితులతో చర్చించకుండా టిడిఆర్ బాండ్లు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. టిడిఆర్ విధానాన్ని అన్ని గ్రామాల అవగాహన సదస్సుల్లో నిర్వాసితులు వ్యతిరేకించారని పేర్కొన్నారు. టిడిఆర్ బాండ్ల నిర్ణయాన్ని రద్దు చేసి, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నగదు రూపంలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. బ్రహ్మాజీ, కె. సోమునాయుడు, కె. బాబురావు తదితరులు

# డాక్టర్. శ్యామ్ ముఖర్జీ సిద్ధాంతాలు మనందరికీ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి

చింతూరు ,(కింగ్ )



చింతూరు మండలం లో బూత్ నంబరు 348 దేశ సమగ్రత కోసం పరిపాలన విధాన కోసం పోరాడిన మహనీయుడు డాక్టర్. శ్యామ్ ముఖర్జీ అస్తమించిన ఈ బలిదాన్ దివస్ రోజున ఆయనకు ఇవాళ నేర్పిస్తూ ఆయన ఆశయాలను మరొకసారి చేసుకుందాం జాతీయ ఐక్యత కోసం ఒక చిరస్మరణీయం నిలిచిన ముఖర్జీ గారి సిద్ధాంతాలు మనందరికీ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గారికి ఘన నివాళులు అర్పించారు

ఈ కార్యక్రమం లో చింతూరు బిజెపి మండల అధ్యక్షులు బట్ట లక్ష్మయ్య, రాజు,అప్పాజీ శివాజీ మహమ్మద్ షేక్. గౌరీ.శారద. శ్యామల. సరోజినీ. రాజేంద్ర. రమాదేవి.బాపమ్మ. భాగ్యలక్ష్మి. సరోజిని. స్వప్న. స్వాతి. పాల్గొన్నారు.

# ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కరువు

## మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి: సీఐటీయూ

అచ్యుతాపురం,(కింగ్ )



పరవాడ ఫార్మాసిటీలోని దక్షిణ ఎనర్జీ పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన బాయిలర్ పేలుడు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మంటల్లో చిక్కుకుని దుర్మరణం పాలయ్యారు. అచ్యుతాపురం మండలం జగ్గన్నపేట గ్రామానికి చెందిన బోధపు త్రినాథ్ గత మూడు నెలలుగా సంస్థలో విధులు నిర్వహిస్తున్నాడు. బాయిలర్ పేలుడుతో చెలరేగిన మంటల్లో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. అలాగే చోడవరం మండలం గోవాడ గ్రామానికి చెందిన వేపాడ వెంకటేష్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. రాము తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు.మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.కార్మికుల భద్రత విషయంలోపరిశ్రమలుమరింతబాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని సీఐటీయూ నాయకులు సూచించారు.

# హీరమండలం సబ్ పోస్ట్ ఆఫీస్ అధికారుల నిర్వాకం.. ఒంటి గంట దాటితే సేవల నిలిపివేతతో ప్రజల తీవ్ర అవస్థలు



శ్రీకాకుళం ,(కింగ్ )

శ్రీకాకుళం జిల్లా హీరమండలం మండల కేంద్రంలోని సబ్ పోస్ట్ ఆఫీస్ అధికారుల తీరుపై స్థానిక ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాల్సిన పోస్టల్ సేవలు మధ్యాహ్నం ఒంటి గంటకే నిలిచిపోతుండటంతో పోస్ట్ ఆఫీస్ కి వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మధ్యాహ్నం 1:00 గంట తర్వాత ఎటువంటి సాధారణ లేదా అర్జెంట్ పోస్ట్‌లను స్వీకరించేది లేదని ఇక్కడి సిబ్బంది కచ్చితంగా చెబుతున్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నించగా, "సర్వర్ పనిచేయడం లేదు, మాకు ఒంటి గంట వరకే లిమిటేషన్ ఉంది అని అధికారులు బాధ్యతారాహిత్యంగా సమాధానాలు ఇస్తున్నారు. అత్యవసరమైన పోస్ట్‌లు పంపడానికి వచ్చే ప్రజలను సైతం వెనక్కి పంపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం డిజిటల్ సేవలను విస్తరిస్తున్నామని చెబుతున్నా, ఇక్కడి క్షేత్రస్థాయిలో మాత్రం సర్వర్ నెపంతో సేవలను నిలిపివేయడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న హీరమండలం పోస్ట్ ఆఫీస్ అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పూర్తిస్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆరిమాని గంగమ్మ గుడి నూతన చైర్మన్ గా .గుండాల జలేంద్రనాయుడు




గంగాధర నెల్లూరు ,(కింగ్ )

ఎస్ఆర్ పురం ఆరిమాని గంగమ్మ గుడి నూతన చైర్మన్ గా మెదవాడ గ్రామానికి చెందిన గుండాల జలేంద్రనాయుడు.. ఎన్నికయ్యారు... సోమవారం కార్వేటి నగరం మండలంలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.. ఆరిమాని గంగమ్మ గుడి నూతన చైర్మన్ జలేంద్ర నాయుడు ను ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అభినందించారు... ఆరిమానిగంగమ్మ గుడి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ నూతన ఆలయ చైర్మన్ జలేంద్ర నాయుడు కు తెలియజేశారు.. నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సార్ కి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలియజేశారు అలాగే గంగమ్మ గుడి అభివృద్ధి పనులు వేగవంతంగా చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని ఆరిమాని గంగమ్మ గుడి నూతన చైర్మన్ జలేంద్ర నాయుడు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు.. మాజీ ఎంపీటీసీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ సీఈవో కు వినతిపత్రం

## మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం స్థల మార్పిడి కోరుతూ వినతి...

పెందుర్తి ,(కింగ్ )

పెందుర్తి మండలం కరకవానిపాలెం గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరుతూ పెందుర్తి మండల పరిషత్ సభ్యులు జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కరకవానిపాలెం గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ కేంద్రం ఏర్పాటుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్రం కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని వారు కోరారు.

ఈ సందర్భంగా పెందుర్తి మండల వైస్ ఎంపీపీ చిరికి దేవుడు మాట్లాడుతూ, గ్రామస్తుల ఆందోళనలను అధికారులు సానుకూలంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి సమస్యను వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిరికి దేవుడుతో పాటు నాయకులు గంద్రెడ్డి నగేష్, ముదపాక శివ, గండి భూషణరావు పాల్గొన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని వారు అధికారులను కోరారు.

# వైష్ణవి దేవి ఆలయంలో ఘనంగా చండి హోమం

## భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

## . ప్రధాన అర్చకరాలు శ్రావణి

అన్నమయ్య జిల్లా ,(కింగ్ )

జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గ చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామంలో వెలసి యుండు స్వయంభు శ్రీ వైష్ణవి దేవి ఆలయంలో నిజ జేష్ఠ శుద్ధ ఏకాదశినీ 25-06-2026 వా తేదీ గురువారం ఉదయం 8:00 వేద పండితులచే సామూహిక చండీ అత్యంత వైభవముగా జరుగును. అలాగే కలశ పూజ, గో పూజ, సుమంగళి పూజ, కన్య పూజ, పూర్ణాహుతి అనంతరం అమ్మవారికి పంచామృతాభిషేకం మహా మంగళహారతి జరుగును అనంతరం భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించబడును కావున మండల, జిల్లా, పరిధిలోని భక్తాదులందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాల సిందిగా కార్యనిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కొరకు ఈ క్రింది తెలిపిన మొబైల్ నెంబర్ ద్వారా సంప్రదించవలసిందిగా కోరడమైనది.. మొబైల్ నెంబర్ 6303834722, 9618161213




# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.

## జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్.నిర్ణీత కాలపరిమితిలో ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలి

## సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి.శ్రీ హెల్మెట్ వినియోగం పై విస్తృతంగా అవగాహన కల్పించాలి.

శ్రీకాకుళం ,(కింగ్ )





పోక్సో, మహిళలపై జరిగే నేరాలు మరియు ఇతర ముఖ్యమైన గ్రేవ్ కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యతతో వేగవంతంగా పూర్తి చేసి,నిర్దేశించిన గడువులోపు ఛార్జ్‌షీట్లు కోర్టులకు దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్., పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ కేసులు దర్యాప్తు,ఛార్జ్‌షీట్ల స్థితి, నేర నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, గ్రేవ్,పోక్సో కేసులు, ఆస్తి నేరాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా కేసులు, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు తదితర ప్రాధాన్యత కలిగిన కేసుల దర్యాప్తుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి కేసును నాణ్యతతో కూడిన దర్యాప్తు ద్వారా పూర్తి చేసి, నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలు సేకరించాలని సూచించారు. దర్యాప్తులో జాప్యం జరగకుండా పర్యవేక్షణ అధికారులు నిరంతరం సమీక్ష నిర్వహించాల ని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్ణీత గడువులో ఛార్జ్‌షీట్లు కోర్టులకు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారంట్ల అమలు, నాన్-బెయిలబుల్ వారంట్ల పెండింగ్ తగ్గింపు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై నిఘా, మిస్సింగ్ కేసుల పరిష్కారం, పెండింగ్ పిటిషన్ల విచారణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు.:-జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత మరియు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముఖ్యమైన గ్రామాలు, గ్రామ కూడళ్లు (జంక్షన్‌లు), ప్రధాన రహదారులు మరియు ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరిగా చేపట్టాలన్నారు.

హెల్మెట్ వినియోగం పై అవగాహన, అభయం హెల్మెట్ బ్యాంకు ద్వారా ప్రయాణ సమయంలో ప్రతి వాహన దారులు హెల్మెట్ ధారణ, ప్రమాదాలు నివారణ మైనర్ డ్రైవింగ్ క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని, సంకల్పం, నారీ శక్తి కార్యక్రమాలు ద్వారా గ్రామాలు, పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, మత్తు పదార్థాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణపై అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు పనిచేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి శ్రీనివాసరావు,డీఎస్పీలు డి లక్ష్మణరావు, గోవిందా రావు, భాస్కర్ రెడ్డి, భవాని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశాలక్ష్మీ, పోలీసు లీగల్ ఎడ్వైజర్ యామిని,జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# దేవళంపేట విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

గంగాధర నెల్లూరు ,(కింగ్ )



గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలంలోని దేవళంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సాఫ్ట్వేర్ స ఇంజనీర్లు లోహిత్ రెడ్డి, సీత సాయి దేదీప్యల సహకారంతో విద్యార్థులకు విద్యాసామగ్రిని మంగళవారం పుత్తూరు ఉ ప విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు పంపిణీ చేశారు. దాతల సహకారాన్ని సక్రమంగా వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆయన కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో కొనసాగేలా చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి దామోదరం స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని లీలావతి మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి పలు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారని వీటిని సక్రమంగా నియమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయిని నీరజ, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేష్, సిఆర్పి సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

# తేలికపాటి పరికరాలతో శ్రమ ఆదా

## -జాయింట్ కలెక్టర్ టి. శ్రీ పూజ

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

## గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు, నాటుకోళ్ల పంపిణీ

## ఘనంగా ఐఏఆర్ఐ, బిసిటి కేవీకే సంయుక్త కార్యక్రమం

జి.మాడుగుల ,(కింగ్ )

ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించడం ద్వారా రసాయనాల్లేని సేంద్రీయ ఉత్పత్తులను మరింతగా పెంచాలని జాయింట్ కలెక్టర్ టి.శ్రీ పూజ పిలుపునిచ్చారు. మంగళవారం జి.మాడుగుల మండలం పుత్తడి గొంది గ్రామంలో, బిసిటి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన ఉపప్రణాళిక కింద వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న ఆధునిక, తేలికపాటి పరికరాలు గిరిజన రైతులకు శ్రమను తగ్గించడమే కాకుండా, పంటల రక్షణకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ చందు మీనా మాట్లాడుతూ, దేశంలోని రైతులందరికీ ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతికతను చేరవేయడమే ఐఏఆర్ఐ ముఖ్య ఉద్దేశమన్నారు. గిరిజన రైతుల జీవన ప్రమాణాలను పెంచేందుకు ఈ ప్రాంతంలోని 8 గ్రామాలకు చెందిన రైతులకు స్ప్రేయర్లు, విత్తన గొర్రులు (సీడ్ డ్రిల్స్), టార్పాలిన్లు, పవర్ వీడర్లు, చిరుధాన్యాల విత్తనాలతో పాటు అదనపు ఆదాయం కోసం నాటు కోళ్లను కూడా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.



బిసిటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా మాట్లాడుతూ ప్రస్తుతం గిరిజన ప్రాంతాలలో కెవికె ద్వారా అందిస్తున్న సేవలను, వివిధ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, తహసీల్దారు రాజకుమార్, వ్యవసాయ అధికారి పాత్రుడు, శాస్త్రవేత్తలు ప్రదీప్, వాన ప్రసాదరావు, విజయరాగ్ని, నాగేంద్ర, బిసిటి ప్రతినిధులు సీతారామరాజు, రత్నకుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు 8 గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలి

## జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ



అన్నమయ్య జిల్లా,(కింగ్ )

జిల్లాలోని పుంగనూరు మండలంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రతి ప్రాంతంలోను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. మంగళవారం ఏడి శివకుమార్, ఏవో రాధతో కలసి చదళ్ల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ద్వారా సముద్ర ఉపరితలంలో ఉష్ణోగ్రతలు పెరిగి, వాతావరణంపై ప్రభావం ఉంటుందని, దీని కారణంగా వర్షపాతం సాధారణ స్థాయి కన్న తగ్గే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తక్కువ నీటితో పండించే పంటలను ఎంచుకోవాలన్నారు. సూక్ష్మ, బిందునీటి పద్దతులను అవలంభించాలని, ఫారంపాండ్లు ఏర్పరచుకోవాలని, ప్రకృతి వ్యవసాయంతో నెలలో తేమను నిల్వ ఉంచే పద్దతులతో వ్యవసాయం చేయాలన్నారు. అలాగే పిఎండిఎస్ విత్తనాలను సాగు చేసుకుని , పశువులకు మేత, పచ్చరొట్ట ఎరువులుగా రెండు విధాలుగా ఉపయోగించుకోవాలన్నారు. బోరు బావుల క్రింద వరిపంటలు తగ్గించాలని కోరారు.

# పెందుర్తి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



పెందుర్తి ,(కింగ్ )

పెందుర్తి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ ఎన్నికలు పెందుర్తిలోని ఐపిసి చర్చిలో ఘనంగా నిర్వహించారు. 2026 – 2028 కాలానికి గాను కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం పెందుర్తి ఐపిసి చర్చి పాస్టర్ బి. వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు: అధ్యక్షుడు – వై.ఎస్.ఎస్. పాల్ ఉపాధ్యక్షుడు – ఎం. హోసన్న కార్యదర్శి – దేవకుమార్ ఉప కార్యదర్శి – ఎం.ఎస్.వి. ప్రసాద్ కోశాధికారి – ఎం. కిరణ్ కుమార్ ఉప కోశాధికారి – కే. శామ్యూల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు: ఏ. బారనాబాస్, ఎం. దేవిడ్, టి. సుధాకర్, ప్రసన్న కుమార్, నాని బాబు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాస్టర్లు సి. హెచ్. దానియల్, బి. వరప్రసాద్, వి. పాల్ సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. పాస్టర్స్ ఫెలోషిప్ ద్వారా మండలంలోని చర్చిల మధ్య ఐక్యత, ఆధ్యాత్మిక అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేయాలని సూచించారు. నూతన కార్యవర్గం సమిష్టిగా పనిచేసి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

# డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన బిజెపి నాయకులు.

శ్రీకాకుళం ,(కింగ్ )

బిజెపి పూర్వ రూపమైన భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా, మంగళవారం బలిదాన్ దివస్ ను, శ్రీకాకుళం నగరం, బిజెపి ఈస్ట్ మండలంలోని పోలింగ్ బూత్ నంబరు 207 లో,బిజెపి పూర్వ జాతీయ కౌన్సిల్ సభ్యుడు,పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్ చల్లా వెంకటేశ్వర రావు అధ్వర్యంలో పోలింగ్ బూత్ సభ్యులతో, డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు డా. పైడి సింధూర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్ర గురించి పైడి సింధూర సభ్యులకు తెలియజేసారు. చల్లా భాగంగా చల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా బిజెపి నాయకులు పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా వెంకటేశ్వర రావు పూర్వ బిజెపి నేషనల్ కౌన్సిల్ మెంబర్ బిజెపి ఇ-లైబ్రరీ రాష్ట్ర కన్వీనరు బిజెపి శ్రీకాకుళం జిల్లా కోర్ కమిటీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు



# పాడేరు మొద కొండమ్మ అమ్మవారి ఆలయం లో ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో అన్నసమరాధన కార్యక్రమం...



పాడేరు ,(కింగ్ )

పాడేరు గిరిజన ఆరాధ్యదైవం శ్రీ శ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారధన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి సుదీర్ఘ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని స్వీకరించడం జరిగినది . ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ఉద్యామ్ ఆధార్ పై అవగాహన సదస్సు

సదుం,(కింగ్ )



అన్నమయ్య జిల్లా ఏపీ. ఎం .ఎస్. ఎం. ఈ కార్పొరేషన్ జిల్లా పరిశ్రమ కేంద్రం ఆధ్వర్యంలో స్కీంలో భాగంగా ఉధ్యామ్ ఆధార్ పై బుధవారం మధ్యాహ్నం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐకెపి ఇన్చార్జి ఏపిఎం భాను కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ శక్తి భవన్లో మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి ఇండస్ట్రియల్ బృందం హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. వెలుగులో కుటీర పరిశ్రమలపై రుణాలు లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఉధ్యామ్ ఆధార్ తప్పనిసరిగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఇందుకోసం పాన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకుకు లింకు అయిన పాస్ పుస్తకం తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

# రైతన్నలకు సబ్సిడీ కింద తార్పాలిన్ పట్టలు పంపిణీ

సదుం,(కింగ్ )



అన్నమయ్య జిల్లా స్థానిక వెలుగు సామాఖ్యా కార్యాలయంలో రైతన్నలకు సబ్సిడీ కింద తార్పాలిన్ పట్టలు పంపిణీ చేస్తున్నట్లు ఇన్చార్జి ఏపిఎం భాను కుమార్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దగ్గర పడుతుండడంతో రైతులకు వివిధరకాలుగా ఉపయోగపడే అత్యవసరమైన తార్పాలిస్ పట్టలను ప్రభుత్వం సబ్సిడీ కింద అందజేస్తుందని ఆయన పేర్కొన్నారు. 18 × 30 కొలతల గల తార్పాలిన్ పట్ట సబ్సిడీ పోను రూ, 2,300 రూపాయలకే పంపిణి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం 50 పట్టలు పంపిణీకి అందుబాటులో సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మండలంలోని రైతన్నలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఎస్.ఐ.ఆర్ లో పాల్గొన్న యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు

శ్రీకాకుళం ,(కింగ్ )



ఓటర్ ఎన్యుమరేషన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస డివిజన్ లో వైసిపి యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు పర్యటించి, బి ఎల్ ఓ మరియు బి ఎల్ ఏ లతో కలిసి ఓటర్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బాణాల గాంధీ, బాణాల దాలినాయుడు, రావాడ రాము, బుడ్డి గణేష్,రమేష్, లక్ష్మికాంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల బస్సులపై ఆకస్మిక తనిఖీలు చేసిన. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ & టౌన్ సీఐ.

సాలూరు. ,(కింగ్ )




సాలూరు పట్టణంలో విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులపై ఆకస్మికఅ తనిఖీలు నిర్వహించబడినవి. ఈ తనిఖీలను సాలూరు మోటారు వాహనాల ఇన్స్పెక్టర్ ఎంవిఐ. జె.వి.ఎస్.ఎస్. ప్రసాద్ రావు మరియు సాలూరు టౌన్ సీఐ అప్పలనాయుడు సంయుక్తంగా నిర్వహించారు.తనిఖీల సందర్భంగా పాఠశాల బస్సుల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర రికార్డులను పరిశీలించారు. అలాగే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అత్యవసర నిష్క్రమణ సదుపాయాలు మరియు ఇతర భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లు మరియు సిబ్బందికి విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, రోడ్డు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచనలు ఇవ్వబడినవి.విద్యార్థుల సురక్షిత ప్రయాణం కోసం ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా లక్ష్యంతో, కాశ్మీర్ కోసం ప్రాణాలర్పించిన జాతీయ వాది

## జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ





కొయ్యూరు ,(కింగ్ )

బీజేపీ గిరిజన మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు, మరియు భారతీయ జనతా వారధి కో కన్వీనర్ అరిమెల రాజు ఆధ్వర్యంలో (బూత్ 105) రత్నంపేట వారి ఇంటి వద్ద డాక్టర్ శ్రీ శ్యాంమా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన కి పుష్పాంజలి ఘటించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం, ఒకే పరిపాలనా విధానం కోసం పోరాడిన మహనీయుడు డా. శ్యామాప్రసాద్ ముఖర్జీ అస్తమించిన ఈ బలిదాన్ దివస్ రోజున ఆయనకు నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాలను మరోసారి గుర్తుచేసుకుంటు జాతీయ ఐక్యత కోసం ఒక చిరస్మరణీయ చిహ్నంగా నిలిచిన ముఖర్జీ గారి సిద్ధాంతాలు మనందరికీ నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మరియు కొయ్యూరు కోపరేటివ్ డైరెక్టర్ రీమల చంద్రరావు, పాల్గొన్నారు మరియు ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్టీసీను ప్రైవేటు వారికి ఇచ్చే ఆలోచన విరమించుకోవాలి. ఆర్టీసీ జెఏసి.

సాలూరు,(కింగ్ )




ఆర్టీసీలో సరిపడా సిబ్బంది లేక పని ఒత్తిడి పెరిగిపోతుందని తక్షణమే కాళిలను భర్తీ చేయాలని సాలూరు డిపో ఏపీ పీటీడీ (ఆర్టీసీ )ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా బస్సులను ప్రవేశపెట్టి డిపోలు మూసివేయడం మరికొన్నింటిలో సగం స్థలమును ప్రైవేటు వారికి కేటాయించడం దారుణం అన్నారు. శ్రీ శక్తి పథకం అమలు తర్వాత పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల సంఖ్యను పెంచాలి.అలాగే పెండింగ్ లో ఉన్నా డి ఏ బకాయిలు తక్షణమే ఇవ్వాలిని, పిఆర్సి కమిషన్ ను నియమించి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఐ ఆర్ ను ప్రకటించాలని అలాగే 2029 నాటికీ విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ నీ ప్రైవేటు వరకు అప్పగిస్తూ ఇచ్చిన +రా. చీ. 88 నీ రద్దు చేయాలని, 1/2019 సర్కులర్ ని అన్ని డిపో యూనిట్లో తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాలూరు డిపో జేఏసీ నాయకులు పి.సూర్యారావు, జె. కిరణ్ కుమార్, పి. చంద్రశేఖర్, వి.కోటేశ్వరరావు. రావు, పి. జ్యోతి గారు, అధిక సంఖ్యలో జేఏసీ నాయకులు హాజరై ధర్నా లో పాల్గొనడం జరిగింది.

# దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ కల్పించాలంటూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి

ఏలేశ్వరం,(కింగ్ )




దళిత క్రైస్తవులకు మత స్వేచ్ఛ కల్పించాలని 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఏలేశ్వరం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు మంగళవారం శాంతియుత ర్యాలీ నిర్వహించి మండల డిప్యూటీ తహసీల్దార్ కె. నాగబాబుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు కె. పాల్ ప్రసాద్ కార్యదర్శి ఏబీవీ ప్రసాద్ గౌరవ అధ్యక్షుడు జాన్ విల్సన్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, మత మార్పిడి కారణంగా ఎస్సీ హక్కులను కోల్పోయే ప్రస్తుత విధానాన్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇతర మతాల్లోకి మారిన వారికి లేని ఆంక్షలు క్రైస్తవ మతంలోకి మారిన దళితులపై మాత్రమే అమలు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్. ఎలైజా, కె. ప్రకాష్ పాల్, నెల్సన్, వాసా శామ్యూల్, కుమార్ పాల్, పి. ప్రవీణ్ పాల్, మణికుమార్, బి. సునీత పాల్, నేతుల ప్రసాద్, కె. సమర్పణరావు, ఆర్. ఆమోస్, జాన్ పిన్ని, వి. లాజర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి సేవలో చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు

విశాఖపట్నం,(కింగ్ )





..శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని, ఆలయంలో నిర్వహించిన అన్నదాన ప్రసాద కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ డాక్టర్ కందుల నాగరాజు స్వయంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులకు తన చేతుల మీదుగా అన్నదాన ప్రసాదాన్ని వడ్డించి, వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే దర్శన ఏర్పాట్లు, భోజన సౌకర్యాలు మరియు ఆలయంలో కల్పిస్తున్న వసతుల గురించి భక్తులను అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకుని, మరింత మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచనలు చేశారు.భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, నాణ్యమైన ప్రసాదం అందించడం దేవస్థానం ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు.

# సిపిఐ నియోజకవర్గ కార్యదర్శిగా రాధా నాయుడును నియమించిన సిపిఐ పార్టీ.



సాలూరు. ,(కింగ్ )

.సాలూరు నియోజకవర్గ కార్యదర్శిగా.బలగ.రాధానాయుడును ఆ పార్టీ నియమించింది.మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో సిపిఐ పార్టీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో పార్టీ విస్తృత పైన,పార్టీ మనుగడపైన, భవిష్యత్తు కార్యాచరణపైనహో చర్చించారు.అనంతరం జిల్లా కార్యదర్శి మన్మధరావు సాలూరు నియోజకవర్గానికి చెందిన.బలగ.రాధానాయుడును సాలూరు నియోజకవర్గ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.రాధా నాయుడు నియామకం పట్ల ఆ పార్టీ నాయకులు ఆర్ వి ఎస్ కుమార్,ఈ.వి. నాయుడు, ఎస్ అనంతరావు, గోపి నాయుడు,రవి కుమార్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రాదానాయుడు మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి నియోజకవర్గ కార్యదర్శిగా నియమించటం చాలా ఆనందదాయకమని పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో తాను ముందుండి కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఏఐటియుసి మన్యం జిల్లా కార్యదర్శిగా కార్మిక సమస్యలపై పోరాటాలు చేయడం జరుగుతుందని ఇకమీదట సిపిఐ ఏఐటియుసి సంయుక్తంగా మరిన్ని ప్రజా సమస్యల పరిష్కారానికిహో ప్రజా పోరాటాలు చేసేందుకు పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# భూములిచ్చిన 520 మందికి న్యాయం చేయాలని వినతి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ స్పీకర్

విశాఖపట్నం,(కింగ్ )



.గూగుల్ డేటా సెంటర్ కు భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని తర్లువాడకు చెందిన రైతులు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును కోరారు. పిటిషన్స్ కమిటీ సమావేశం కోసం మంగళవారం జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన ఆయన్ను కలిసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుపై గౌరవంతో తర్లువాడ సర్వే నెంబర్ 1 లో 100 ఎకరాలు ఇచ్చామన్నారు. భూసేకరణ సమయంలో సర్క్యూట్ హౌస్ లో నిర్వహించిన సమావేశంలో 520 మందికి మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆర్డీఓ, ఎమ్మార్వో లు హామీ ఇవ్వడం వల్ల తమ స్వాధీనంలోని భూములను అప్పగించామని తెలిపారు. 2020-21 లో ఒక సెంటు ఇళ్ల స్థలాల పూలింగ్ కోసం తీసుకోవడానికి వైసీపీ ప్రభుత్వం ప్రయత్నించగా తాము అంగీకరించలేదని, కోర్టులో 11207/ 2020 నెంబరుతో కేసు వేశామని వివరించారు. 200 ఎకరాల్లో గ్రావెల్ క్వారీ కోసం డీఆర్ఓ ప్రజాభిప్రాయ సేకరణ చేసినప్పుడు కూడా 520 మంది వ్యతిరేకించి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించామని చెప్పారు. డి పట్టాలున్న వారికి 20 శాతం నివేశన స్థలం, 20 శ 25 సైజు షాపులు, కుటుంబానికి ఒక ఉద్యోగం చొప్పున ఇస్తామన్న హామీలు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రఘు రామకృష్ణంరాజు వారికి హామీ ఇచ్చారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాత్రాజు అప్పారావు, తర్లువాడ మాజీ సర్పంచులు బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, జనసేన జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, కోరాడ ఆదినారాయణ, బంకు రాజు, కన్నయ్య, బాలి వెంకటరాజు తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

## చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు ,(కింగ్ )





ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం అని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు ఆర్ & బి అతిథి గృహంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు మండలం, నందవరం మరియు గోనెగండ్ల మండలాలకు చెందిన 88 మంది లబ్ధిదారులకు రూ. 61,23,755 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అందజేశారు.అలాగే గత రెండు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి,వైద్య రీయింబర్స్‌మెంట్, ఆర్థిక సహాయం కింద ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన మొత్తం 348 మంది లబ్ధిదారులకు రూ.2.82 కోట్ల మేర సహాయం అందించబడిందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆపద్బాంధవుడిగా నిలుస్తోందని, అత్యవసర వైద్య చికిత్సలు, ప్రమాదాలు మరియు ఇతర క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని అనేక మంది ప్రజలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా కొత్త జీవితం లభిస్తోందని పేర్కొన్నారు.పేదల సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, అవసరమైన ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారుఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు ప్రజలు పాల్గొన్నారు.

# జలధార పనులు వేగవంతం చేయాలి

## తంగడంచ చెరువులో ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించిన కలెక్టర్

నంద్యాల ,(కింగ్ )



జిల్లాలో జలధార-జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా మండలం తంగడంచ గ్రామంలోని చెరువుకు సంబంధించిన ఫీడర్ ఛానల్, సప్లై ఛానల్ అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. పనుల ప్రాంతానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆటోలో సుమారు నాలుగు కిలోమీటర్లు ప్రయాణించి క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. చెరువుకు నీరు చేరే రెండు ఫీడర్ ఛానళ్ల పనుల పురోగతి, నీటి ప్రవాహ పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఉపాధి హామీ పథకం కింద రూ.6.73 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. చెరువు పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తే నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. చెరువుల పరిరక్షణ ద్వారా భూగర్భ జలాలు పెరిగి రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో పనులు పూర్తి చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, మైనర్ ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహం

నంద్యాల ,(కింగ్ )



నంద్యాలజిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన లక్ష్యాల సాధనలో ఉన్న లోపాలను గుర్తించి గ్యాప్ అనాలిసిస్ చేపట్టాలని, రుణాల మంజూరులో జాప్యాలను తగ్గించి అర్హులైన వారికి ఆర్థిక సహకారం అందించాలని బ్యాంకర్లకు సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో అందిన 27 దరఖాస్తుల్లో 20కు అనుమతులు మంజూరయ్యాయని, మిగిలిన ఏడు దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రాయితీ పథకాల కింద జిల్లాలోని 21 పరిశ్రమలకు రూ.5.88 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను కమిటీ ఆమోదించింది. సమావేశంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ ఎస్. మహబూబ్ బాషా, ఎల్డీఎం అయ్యప్పరెడ్డి, నాబార్డు డీడీఎం కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ బస్సులు ఆర్టీసీ సంస్థ నడపాలి

## మద్దతు తెలుపుతున్న సిఐటియు నాయకులు రాముడు

ఎమ్మిగనూరు ,(కింగ్ )



విద్యుత్ బస్సులో ఆర్టీసీ సంస్థ నడపాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాముడు సిఐటియు మండల సహాయ కార్యదర్శి ఏ సురేష్ డిమాండ్ చేశారు మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ బస్సులు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో ముందు జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాముడు సిఐటియు మండల సహాయ కార్యదర్శి ఏ సురేష్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఆర్టీసీలో ప్రైవేటు బస్సులను ప్రైవేటు వారకు అప్పగించి నడపడం సరైనది కాదన్నారు రాష్ట్ర ప్రభుత్వమే ఆర్టీసీ సంస్థ ద్వారా విద్యుత్ బస్సులను నడపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు ప్రస్తుతము ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులను భర్తీ చేయాలని అలాగే ఉద్యోగులకు రావలసిన ఇవ్వాలని శ్రీ శక్తి పథకం నడుస్తున్న బస్సులను మరియు మహిళలకు తగ్గట్టు 4000 బస్సులను కొత్తగా తెప్పించాలని గ్యారేజీలో వర్క్ షాప్ లో కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆర్టీసీ డిపో ముందు జరిగిన ధర్నాలు సిఐటియు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

# సెయింట్ జాన్స్ విద్యార్థి బాలాజీ కి 10 లక్షల ప్యాకేజ్

## విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్

ఎమ్మిగనూరు ,(కింగ్ )




ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కె.సి. బాలాజీ మండల పరిధిలోని ఎర్రకోట గ్రామం పరిధిలోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కాలేజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్( ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విభాగంలో పూర్తి చేసి, ప్రముఖ ఐటీ సంస్థ టిసిఎస్ లో వార్షిక రూ.10 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించడం కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సుధాకర్ మంగళవారం తెలిపారు.

ఈ సందర్భంగా బాలాజీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. విద్యార్థి సాధించిన ఈ విజయంతో కళాశాల విద్యా ప్రమాణాలు మరోసారి నిరూపితమయ్యాయని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. జి.కె.వి. నరసింహారెడ్డి, హెచ్ ఓ డి డా. సి.వి. మధుసూదన్ రెడ్డి పాల్గొని విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

# వక్ఫ్ భూములపై వైసీపీ ఆందోళన

## మంత్రి ఫరూక్ రాజీనామా చేయాలని డిమాండ్



నంద్యాల ,(కింగ్ )

నంద్యాల జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తులను ప్రభుత్వ అవసరాలకు కేటాయించడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా మాట్లాడుతూ, కొలూరు ఈద్గా పరిధిలోని వక్ఫ్ భూమిని కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించడం, చాబోలు వద్ద వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ కోసం వినియోగించడం సరైన చర్య కాదన్నారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ విఫలమయ్యారని ఆరోపించారు.

వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజానికి చెందినవని, వాటి పరిరక్షణ కోసం ముస్లింలంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. అవసరమైతే చట్టపరంగా కూడా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, రసూల్ ఆజాద్, సలముల్లా, గన్నీ కరీం, ఎం.గౌస్, దేవనగర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల శిథిలాల రాళ్లు వేలం చేయబడును

ఎమ్మిగనూరు ,(కింగ్ )

తాలూకా పరిధిలో గోనెగండ్ల మండలం ఒంటెడుదిన్నె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థ లో ఉండడంతో మూడు గదులు తొలగించబడునని అందులోని రాళ్లు వేలం వేయనున్నట్లు పాఠశాల చైర్మన్ కే ముని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ పాఠశాల పరిధిలోని శిథిలాలకు సంబంధించిన రాళ్లపై వేలం నిర్వహించబడును తెలిపారు. గ్రామ ప్రజలు, ఇతరులు పాల్గొనవచ్చు అని తెలిపారు.

# జూన్ 24న బుధవారం రాజమహేంద్రవరం, కాకినాడలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పర్యటన

రాజమహేంద్రవరం, ,(కింగ్ )



రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యులు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి గారు బుధవారం జూన్ 24న కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో నిర్వహించే విద్యా, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఉదయం 10.00 గంటలకు కాకినాడ నగరంలోని సర్పవరం ఎఫ్‌సీఐ కాలనీలో ఏర్పాటు చేసిన "నచికేత" విద్యార్థుల ఉచిత నివాస కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

అనంతరం సాయంత్రం 4.00 గంటలకు రాజమహేంద్రవరం సీతంపేటలో"ూవీ=ఖు 2.0 పథకం కింద చేపట్టనున్న పలు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ సందర్భంగా రూ.95.14 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాజమహేంద్రవరం వాటర్ సప్లై వర్క్స్, రూ.92.78 కోట్లతో చేపట్టనున్న సీవరేజ్ అండ్ సెప్టేజ్ మేనేజ్‌మెంట్ వర్క్స్, అలాగే రూ.14.10 కోట్లతో అమలు చేయనున్న వాటర్ బాడీ రీజువెనేషన్ ప్రాజెక్ట్ వర్క్స్కు శంకుస్థాపన చేయనున్నారు.

# పీఎన్‌జీ వినియోగాన్ని ప్రోత్సహించాలి

**ఎల్‌పీజీ మరియు పీఎన్‌జీ కనెక్షన్స్ రెండూ ఉన్న వినియోగదారుడు స్వచ్ఛందంగా ఎల్‌పీజీ కనెక్షన్ ఉపసంహరణ చేయడానికి అవకాశం**

**జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్**

రాజమహేంద్రవరం, ,(కింగ్ )




జిల్లాలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగాన్ని మరింత విస్తరించేందుకు గ్యాస్ డీలర్లు, ఎల్‌పీజీ ఏజెన్సీల ప్రతినిధులు, గోదావరి గ్యాస్ పైప్‌లైన్ సంస్థల ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మంగళవారం కలెక్టరేట్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సవరించిన నిబంధనల ప్రకారం ఒకే కుటుంబానికి పీఎన్‌జీ, గృహ వినియోగ ఎల్‌పీజీ కనెక్షన్లు రెండూ కొనసాగించేందుకు అనుమతి లేదని తెలిపారు. పీఎన్‌జీ కనెక్షన్ పొందిన వినియోగదారులు 30 రోజులలోపు తమ ఎల్‌పీజీ కనెక్షన్‌ను స్వచ్ఛందంగా సరెండర్ చేయడం లేదా భవిష్యత్తులో పీఎన్‌జీ లేని ప్రాంతానికి మారితే తిరిగి పొందేందుకు ట్రాన్స్‌ఫర్ వౌచర్ తీసుకోవడం తప్పనిసరి అని వివరించారు.

అలాగే పీఎన్‌జీకనెక్టివిటీ కలిగిన ప్రాంతాలలోని ఎల్‌పీజీవినియోగదారులు వెంటనే పీఎన్‌జీకనెక్షన్ కొరకు తప్పనిసరిగా దరఖాస్తు చేయాలి.

దీనికి సంబంధించి ఆయా గ్యాస్ ఏజెన్సీలు ఇప్పటికే వినియోగదారులకు నోటీసులు జారీ చేసే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వినియోగదారులకు పూర్తి అవగాహన కల్పిస్తూ ఎటువంటి ఆందోళనకు గురికాకుండా స్పష్టమైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను, గ్యాస్ ఏజెన్సీలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

పైప్డ్ నేచురల్ గ్యాస్ ద్వారా ఇళ్లకు నేరుగా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా అవుతుందని, సిలిండర్ల మార్పిడి అవసరం ఉండదని, మీటర్ ఆధారంగా వినియోగించినంత వరకే చెల్లింపు చెయ్యవలసి ఉంటుందని, లీకేజీ సంభవించినా గ్యాస్ త్వరగా వ్యాపించి భద్రత పరంగా మరింత అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అపార్ట్‌మెంట్లు, పెద్ద గృహ సముదాయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పరిశ్రమలకు పీఎన్‌జీ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అర్హులైన దీపం ▪2 లబ్ధిదారులు ఎల్‌పీజీ నుంచి పీఎన్‌జీకి మారితే సంవత్సరానికి రూ.2,400 సబ్సిడీ పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పీఎన్‌జీకి మారాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరా అధికారి వి పార్వతి , గ్యాస్ డీలర్లు, ఎల్‌పీజీ ఏజెన్సీల ప్రతినిధులు, గోదావరి గ్యాస్ పైప్‌లైన్ సంస్థల ప్రతినిధులు మండపేట, కొవ్వూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్లు, కొవ్వూరు, రాజమండ్రి ఆర్డీఓలు, పీడీ, మెప్మా, డీఆర్‌డీఏ, డీఎస్‌జీఎస్‌వో, పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక లోడ్‌తో ఇసుక రవాణాపై బుధవారం నుంచి కఠిన చర్యలు

**రవాణాదారులతో పాటు రీచ్ నిర్వహణ ఏజెన్సీలపైనా బాధ్యతలు నిర్ధారిస్తాం**

**- జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్**

రాజమహేంద్రవరం, ,(కింగ్ )




జిల్లాలో ఇసుక రవాణా నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వాహనాలు నడపడం, రహదారుల భద్రతకు ముప్పు కలిగించడం, ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లే పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక రీచ్ పాయింట్ల నిర్వహణ ఏజెన్సీలు, ట్రాన్స్‌పోర్టర్లు, సంబంధిత సమన్వయ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. బుధవారం నుంచి జిల్లాలో ఇసుకను అధిక లోడ్‌తో తరలించే వాహనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టనున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. కేవలం వాహన యజమానులు లేదా ట్రాన్స్‌పోర్టర్లపైనే కాకుండా, అధిక లోడ్‌తో వాహనాలను పంపిస్తున్న రీచ్ నిర్వహణ ఏజెన్సీలపైనా బాధ్యతను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అపరాధ రుసుము విధించడం, వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందనీ హెచ్చరించారు. అదే విధంగా ఆయా రీచ్ పాయింట్స్ ఏజెన్సీస్ పై చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఇసుక రవాణాలో అనుమతించిన పరిమితికి మించి లోడింగ్ చేయడం వల్ల రహదారులు దెబ్బతినడం, రోడ్డుపై ఇసుక జారడం, ప్రమాదాలు పెరగడం, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి రీచ్ వద్ద లోడింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు . అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేయడం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం కలగడమే కాకుండా, ప్రజా ఆస్తులైన రహదారులు దెబ్బతిని ప్రజా ధనం వృథా అవుతోందని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘించే ట్రాన్స్‌పోర్టర్లు, రీచ్ నిర్వహణ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమతించిన పరిమితికి మించి ఇసుక ఎక్కించకుండా ఏజెన్సీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎటువంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఇసుక రవాణా వ్యవస్థను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. మైన్స్, రవాణా, ఇరిగేషన్, పోలీస్ తదితర శాఖలు సంయుక్త తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలును కచ్చితంగా పర్యవేక్షించాలని, అక్రమాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను ప్రతి ట్రాన్స్‌పోర్టర్, రీచ్ నిర్వహణ సంస్థ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.


ఈ సమావేశంలో జిల్లా మైన్స్ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాస్, కె. ఆనంద బాబు, ఇసుక రీచ్ పాయింట్ల నిర్వహణ ఏజెన్సీల ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇల్లు అద్దెకు కావాలంటూ వచ్చి తాళిబొట్టు గొలుసు లాక్కెళ్లిన వ్యక్తి అరెస్ట్.

**రెండు రోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులు బంగారు గొలుసు,బైక్ స్వాధీనం.**

**సీసీ కెమెరాలే కీలకం..గొలుసు దొంగ అరెస్ట్.**

నంద్యాల ,(కింగ్ )




నంద్యాల పట్టణం లో

ఇల్లు అద్దెకు కావాలంటూ నమ్మించి ఓ మహిళ మెడలోని బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కెళ్లిన వ్యక్తిని నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు.అతని వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు నేరానికి వినియోగించిన మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదైన రెండు రోజుల్లోనే నిందితుడిని గుర్తించి పట్టుకోవడం గమనార్హం.

పోలీసుల వివరాల ప్రకారం

నంద్యాల పట్టణంలోని బాలకొండ హాలు వీధికి చెందిన ముమ్మడి చరిత ఇంటికి జూన్ 20న ఓ వ్యక్తి వెళ్లి,పై అంతస్తులో ఖాళీగా ఉన్న ఇంటిని చూపించాలని కోరాడు.ఆమె తాళాలు ఇచ్చి ఇంటిని చూసి రావాలని చెప్పగా,కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి తాళాలు అప్పగించాడు.అనంతరం తాగడానికి నీరు కావాలని అడగడంతో బాధితురాలు ఇంట్లోకి వెళ్లి నీళ్లు తీసుకొచ్చింది.

ఈ సమయంలో మహిళను భయభ్రాంతులకు గురిచేసి,ఆమె మెడలోని బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కొని మోటార్ సైకిల్‌పై పరారైనట్లు పోలీసులు తెలిపారు.బాధితురాలి ఫిర్యాదు మేరకు నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీసీ కెమెరాల ఫుటేజీలు,సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు జరిపిన పోలీసులు మంగళవారం సాయంత్రం చెరువుకట్ట ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు.విచారణలో అతడే ఈ ఘటనకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

అరెస్టైన వ్యక్తి తమ్మిశెట్టి శివకృష్ణ (38) సం"గా గుర్తించారు.అతని వద్ద నుంచి బంగారు తాళిబొట్టు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచినట్లు సమాచారం.

ఎస్పీ అభినందనలు.

కేసు నమోదైన రెండు రోజుల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్టు చేసిన వన్‌టౌన్ సీఐ జి.సుధాకర్‌రెడ్డి,సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌తో పాటు దర్యాప్తులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలని సూచన

గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల వద్దకు వచ్చినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు.ఇళ్లకు,అపార్ట్‌మెంట్లకు నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.

# రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు అందించిన లయన్స్ క్లబ్

**ఐక్యరాజ్యసమితి ప్రజా సేవా దినోత్సవం పురస్కరించుకుని.**

**నంద్యాల రైల్వే స్టేషన్ కు చక్రాల కుర్చీలు రెండు అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్**

**చక్రాల కుర్చీల దాతలు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్.**

నంద్యాల ,(కింగ్ )




ఐక్యరాజ్యసమితి ప్రజాసేవ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ కు ప్రయాణికుల సౌకర్యార్థం చక్రాల కుర్చీలు రెండు అందజేశారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, దాతలు నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనం శెట్టి, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు భవనాసి నాగ మహేష్ లు చక్రాల కుర్చీలు రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ కు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ నిరంతర సేవా కార్యక్రమాలను గత 56 సంవత్సరాలుగా చేస్తున్నదని భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.

ఆత్మకూరు సుదర్శనం శెట్టి, భవనాసి నాగ మహేష్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందజేస్తామని తెలిపారు.

రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, వృద్ధులకు ఈ చక్రాల కుర్చీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ చంద్రశేఖర్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ గెలివి సహదేవుడు,లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ మరియు రైల్వే క్రూ కంట్రోలర్ రవి ప్రకాష్, లోకో పైలట్ రామన్న, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఎంపీవి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ యూసుఫ్,నూతన కార్యదర్శిగా ఎంపికైన మేడా చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవి పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం.

**కొండ మాయ పల్లి గ్రామ సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై పడ్డ గుంత.**

రుద్రవరం. ,(కింగ్ )



మండలంలోని రుద్రవరం కొండ మాయపల్లి గ్రామాల మధ్య ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డుపై గుంత ఏర్పడడంతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో చిన్నకంబలూరు మెట్ట సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం దగ్గర ఇలాంటి గుంతే ఏర్పడడంతో మోటర్ సైకిల్ పై వెళుతున్న భార్యాభర్తలు గుంత దగ్గర మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడడంతో మహిళ అక్కడక్కడే మృతి చెందింది. ఈ ప్రధాన రహదారి రుద్రవరం నుంచి సిరివెళ్ల మీదుగా నంద్యాలకు అలాగే మహాదేవపురం గ్రామాలకు వాహనాలు నిత్యం వెళుతూ ఉంటాయి. అలాగే మహానంది, అహోబిలం క్షేత్రాలకు కూడా ఈ రోడ్డు వెంటనే వెళ్తూ ఉంటారు. అందువల్ల వాహనదారులు ప్రమాదాలకు గురికాకముందే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గుంత పడిన చోట మరమ్మత్తులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151."